ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

# దాశరథి కవిత్వం - ఆలోచనాత్మక శీర్షికలు

**డా॥ జంపాల అనూరాధ**
అసోసియేట్ ప్రొఫెసర్ ఆఫ్ తెలుగు
ఎస్.ఆర్. & బి.జి.ఎన్. ఆర్. గవర్నమెంట్ ఆర్ట్స్ & సైన్స్
కళాశాల (అటానమస్), ఖమ్మం. తెలంగాణ

Article Received: 25/08/2025;Article Accepted: 24/09/2025;Published Online: 26/09/2025

DOI:10.53414/Sahithyatharangini.2025.2398

**వ్యాస సంగ్రహం:** ఆధునిక తెలుగు సాహిత్యం లో బహుళ కీర్తి కలిగి స్ఫూర్తి కలిగించే పేరు దాశరథి. మహాకవిగా విరాజిల్లి, అభ్యుదయానికై కలాన్ని కదిలించి తెలుగు సాహితీ మాగాణంలో అసమాన కావ్యపు పంటలు పండించిన కవితా కృషీవలుడు.

దాశరథి రచనలపై వందలాది పరిశోధక, పరిశీలనా వ్యాసాలు వెలువడ్డాయి. వెలువడుతూనే ఉంటాయి. ఆయన రచనల్లో విభిన్న కవితలతో వెలువడిన కవితా సంపుటి "ఆలోచనాలోచనాలు".

“ఆలోచనాలోచనాలు" సంపుటిలోని విభిన్న ఇతివృత్త ప్రధానమైన కవితలన్నీ బహుళ ప్రాచుర్యం గలవే. భాషా సౌందర్యం, భావ గంభీరత కలిగిన ఈ కవితల్లో భావుకతను ప్రతిబింబించేవి కొన్ని, సమాజ చిత్రణ చేసేవి కొన్ని, వ్యంగ్యాత్మకాలింకొన్ని, దేశభక్తి రగిలించేవి మరిన్ని.... ఇలా వైవిధ్యపూరిత వస్తువులతో రమణీయంగా రచించిన కవితలివి.

సృజన ప్రక్రియ ఏదైనా దాని వస్తుగత సుగుణాల్ని పాఠకుడు అనుభవించేందుకు ఆ ప్రక్రియకు నిర్దేశించుకున్న శీర్షిక, ఇంటి గుమ్మంలా ఆకర్షిస్తుంది. శీర్షిక వల్ల కలిగే ఆసక్తి పాఠకుడు ఆసాంతం ఆ రచనని చదివి ఆస్వాదించేలా చేస్తుంది.

తెలుగుకవుల్లో లబ్ధప్రతిష్ఠులైన దాశరథి తన “ఆలోచనాలోచనాలు" లోని కవితలకి నిర్దేశించిన శీర్షికల ప్రత్యేకత మేమిటి? ఏయే అంశాల్ని దృష్టిలో ఉంచుకుని శీర్షికల నిర్ణయం

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

జరిగింది? శీర్షికా నిర్ణయంలో కవి పాటించిన ప్రత్యేకతలేంటి? అనే విషయాల్ని స్థూలంగా పరిశీలించి విశ్లేషించే ఆసక్తితో ఈ వ్యాసరచన జరిగింది.

"ఆలోచనాలోచనాలు' కవితా సంపుటిలోని కవితల్ని విషయపరంగా వర్గీకరించి, వస్తుపరమైన వర్గీకరణ ద్వారా శీర్షికలను కూడా వర్గీకరించి, శీర్షిక ప్రత్యేకతని, శీర్షికా నిర్ణయంలో కవి దృష్టిని విశ్లేషించడం జరిగింది.

**ఉపోద్ఘాతం:** తెలుగు సాహిత్యంలో పరిచయం అవసరం లేని పేరు దాశరథి. విశాల భావాలతో నేల విడిచి సాము చేయకుండా సామాజిక సమస్యలే ప్రేరణగా కలం కదిలించిన ప్రజాకవి, మహాకవి దాశరథి కృష్ణమాచార్యులు. ఆయన ప్రతి రచనా తెలుగు సంస్కృతిని ప్రతిబింబించే భాషాచిత్రంగా భాసిల్లుతుంది.

1975లో ప్రచురించిన దాశరథి "ఆలోచనాలోచనాలు" కవితా సంపుటిలో మొత్తం 48 కవితలున్నాయి. ఇవన్నీ వివిధ పత్రికల్లో అచ్చయినవే. వీటిలో కొన్ని స్వేచ్ఛానువాద కవితలు. సంపుటి ఆరంభంలోనే శీర్షికారహితంగా F.W.BOURDILLON కవితకు తెలుగు అనువాదంతో సంపుటిలోకి ఆహ్వానం పలికారు కవి.

రేయికున్నవి వేయి కన్నులు పగటికున్నది ఒక్క కన్నే వెలుగురేడే కన్నుమూసిన విశ్వమంతట వెలుగు సున్నే మెదడుకున్నవి వేయికన్నులు మనసుకున్నది ఒక్కకన్నే హృదయమున ప్రణయమ్ము తొలగిన బ్రతుకులోగల వెలుగు సున్నే - అనే ఈ చిన్న అనువాద కవితకు శీర్షిక పెట్టకుండా తన కవిత్వ లక్షణరీతిని గడుసుదనంతో ఆవిష్కరించారు.

అలాగే ఈ సంపుటిలోని 111వ పేజీలోని "అగ్నితో అగ్ని చల్లారుననుట నిజము వెతలపై వెతలోర్చి పొందితిని సుఖము" అనే చిరు ఖండికకు కూడా శీర్షిక లేదు.

సృజన సాహిత్యంలో ఒక్కో ప్రక్రియ ఒక్కో రకమైన భావ ప్రేరకతస్థాయిని కలిగి ఉంటుంది. కవిత్వ ప్రక్రియ ప్రత్యేకస్థాయి గలది. ఇది పాఠక మనోస్థాయిని బట్టి వారిలో భావప్రేరణ కలిగిస్తుంది. ఇతర సాహిత్య ప్రక్రియల్లా సులభ గ్రాహ్యం కాదు. కవిత్వ ఆస్వాదనకి పాఠకుడికి కొంత భాషా జ్ఞానం

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

కూడా అవసరమే. అలాగే కవికి భాషా పరిజ్ఞానంతో బాటు అలంకారాది వ్యాకరణ జ్ఞానం ఉన్నప్పుడే కవిత్వ పరిపూర్ణత సాధ్యమవుతుంది.

క్లిష్టమైన సృజనని పాఠక జనరంజకం చేయటంలో శీర్షిక నిర్ణయాత్మక పాత్ర పోషిస్తుంది. పాఠకుడిని కవితా పఠనానికి స్వాగతించేది శీర్షికే.

ప్రజాకవి దాశరథి కవితా రచనలో ఉద్దండులు. వారి కవిత్వపు ప్రశస్తి లోకవిదితం. వారి శీర్షికా ప్రకటన ద్వారా పాఠకులను ఆకర్షించే ప్రయత్నం ఎలా ఉంది. శీర్షికా నిర్దేశంలో దాశరథి ఎలాంటి ప్రత్యేకతలు పాటించారు అనే విషయాల్ని గమనించి విశ్లేషించటమే ఈ వ్యాస ఉద్దేశం.

**విషయ విశ్లేషణ:** ఏ రచనకైనా "శీర్షిక" ఇంటి గుమ్మం వంటిది. అది అందంగా ఉండాలి. బలంగా ఉండాలి. లోపలికి ప్రవేశించాలనే ఆసక్తిని రేకెత్తించాలి. విస్తృతంగా రచనలు చేసే కవులు, రచయితలు తమ రచనలకి “శీర్షిక” ను నిర్ణయించటంలో విభిన్న రీతులని పాటిస్తూ ఉంటారు. ప్రపంచవ్యాప్తంగా ఈ విషయమై విస్తారమైన విశ్లేషణలు ఉన్నాయి.

బొల్యందరు కవులు శీర్షికా నిర్ణయంలో తమ కవిత్వంలోని పదబంధాల్ని లేదా పంక్తులకి విశేష ప్రాధాన్యమిచ్చి, వాటినే శీర్షికగా ఉంచుతారు. ఒక్కోసారి కవితలోని విషయ సూచనని తెలిపే శీర్షికను ఉంచుతారు. ఏదేమైనా శీర్షికా నిర్ణయం పూర్తిగా కవికీ, ఆ కవితలోని విషయానికీ సంబంధించిన విషయం.

**శీర్షికా నిర్ణయ నిర్దేశాలు:** ఏ కవితకైనా శీర్షిక తలతో సమానం. అసలైన కవితతో శీర్షిక పూర్తిగా కలిసిపోవాలి. శీర్షికకీ, కవితకీ మధ్య అతుకు ఉండకూడదు అంటారు ప్రముఖ రచయిత 'ఎలనాగ'. అందువల్ల శీర్షికా నిర్ణయం అనేది చిన్న విషయమేమీ కాదు.

దాశరథి సాంప్రదాయ భూమిక మీద భావసౌధాలు నిర్మించుకున్న కవి. బహుభాషా నిష్ణాతులు. అనువాదంలో చేయితిరిగినవారు. దేశభక్తులు. తెలుగుజాతి ఐక్యత కోరినవారు. బూర్జువా వ్యవస్థ పట్ల నిరసన తెలిపినవారు. సామ్యవాద ప్రియత్వం కలిగి యుద్ధ విముఖత గల శాంతికాముకులు. తెలుగుభాష పట్ల అపరిమిత ప్రేమగలవారు. బహుముఖ సాహితీ సృజన

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

ఆయన ప్రత్యేకత. ఈ ప్రత్యేకతలన్నింటి దృష్ట్యా దాశరథి ఆలోచనాలోచనాలు లోని కవితా శీర్షికల విశ్లేషణని చేయటం జరిగింది.

(అ) కవితలోని నిర్దిష్టపదం / పదబంధం / వాక్యంను శీర్షికగా ఉంచటం

(ఆ) కవితలోని విషయ సూచనని తెలిపే శీర్షికలు

(ఇ) వ్యంగ్య సూచన గల శీర్షికలు

(ఈ) సంఘటనాత్మక శీర్షికలు

శీర్షికా నిర్ణయంలో ఈ నాలుగు పద్ధతులనూ దాశరథి ఆలోచనాలోచనాలు కవితా సంపుటికి అన్వయించి విశ్లేషిస్తున్నాను.

**(అ). కవితలోని పదాల్నే శీర్షికగా ఉంచటం:** ఈ సంపుటిలో దాశరథి ఈ పద్ధతికే ఎక్కువ ప్రాధాన్యతనిచ్చారు. సంపుటిలోని మూడు వంతుల కవితలకు ఈ విధంగానే శీర్షికా నిర్దేశం జరిగింది.

ప్రముఖ ఆంగ్ల సాహితీ బ్లాగర్ ఫిలిప్ కిన్నెర్ ఈ విధానాన్ని సమర్థిస్తూ ఇలా అంటారు "కవితలోని నిర్ధిష్ట పదాలు, పంక్తులు గనుక కవితానుభూతిని సూచించగలిగితే ఆ పదాన్ని, పంక్తిని శీర్షికగా నిర్ణయించవచ్చు" (అనువాదం)

అందువల్ల కవి, తన రచనలోని ప్రధాన పదబంధాల్ని శీర్షికగా నిర్ణయించటం సబబే. పైగా దాశరథి పద ప్రయోగాలు సరళంగా ఉన్నా కూడా గొప్ప భావస్ఫూర్తి కలిగించే విశిష్ట ప్రయోగాలే. డా॥ తూర్పు మల్లారెడ్డి తన వ్యాసంలో దాశరథి పదప్రయోగాల్ని పరామర్శిస్తూ ఇలా అంటారు. "దాశరథి విశేష్య విశేషణాలతో కూడిన పదబంధాలతో అచేతనాలకి చేతనత్వం కలిగించి భావస్ఫూర్తి కలిగిస్తాడు". ఇలాంటి భావస్ఫూర్తి కలిగించే పదబంధాల్ని శీర్షికగా ఉంచితే ఆ కవితకు మరింత శోభ వస్తుంది.

ఈ సంపుటిలోని మొదటి కవిత "ఆలోచనాలోచనాలు". ఈ పేరే సంపుటికి కూడా ఉంచారు. ఈ కవితలో దాశరథి లోకంలోని అశాంతినీ, ఆకలినీ, అమాయకుల నిరాశనీ, ప్రస్తావిస్తూ వాటి అంతానికి సమరం సాగించాలని సూచించారు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

"ఇది కథకాదు కాలుతున్న సౌద ఇది యెదలో సాగుతున్న రొద దీన్ని కలకాలం భరించలేం కద? అందుకే సమరం సాగింతాం పద! చూపుల సెర్చిలైట్లకు అడ్డంగా దాపురించిన ఈ అంధకార గంగ ఆలోచనాలోచన కాంతిపథంలో అదృశ్యమైపోతుంది ఒక్క క్షణంలో... అని ఆలోచనకి సమస్యల అంధకారాన్ని పారద్రోలే కాంతిపథంగా వర్ణించటం వల్ల ఈ పదంలోని భావస్ఫూర్తి పాఠకుడిని ఆకర్షిస్తుంది. అందువల్ల దానినే శీర్షికగా నిర్ణయించారు.

ఆశావహ దృక్పథంతో సాగే 'స్వాతంత్ర్యమాసం" కవితకి కూడా కవి, ప్రథమ పంక్తినే శీర్షికగా ఉంచారు.

"స్వాతంత్ర్య మాస మిదిగో భరతాంబ హాసమిదిగో అసేతు శీతనగము జనతా విలాసమిదిగో అని సాగే కవితలో సూటిగా విషయ నిర్దేశాన్ని శీర్షిక ద్వారా పాఠకులకి సూచించారు.

"ఆత్మాన్వేషణ" కవితలో కూడా...

"నన్ను నేనే వెతుకుతున్నా నిన్నినాళ్ళు

వలయు నాత్మాన్వేషణకు నీ రెండు కళ్ళు" - అని ప్రారంభ వాక్యాల్లోని పదాన్నే శీర్షిక చేశారు.

"తుషార క్రీడ" కవితలో చివరి రెండు వాక్యాల్లోని పద ప్రయోగాన్ని

"ఇది నా తుషార్ క్రీడ ఇది నా ఆశల రవ్వల మేడ!!

శీర్షికగా నిలిపి పాఠకమదిని కవితా పఠనానికి ఆయత్తం చేశారు.

"వెలుగుల వంతెన" కవితలోని మొదటి ఖండికలోనే" "రెండు చీకటి కొండల మధ్య నిండైన కాల ప్రవాహం మీద ఎవరు కట్టారీ వెలుగుల వంతెన? అని ఆసక్తి కలిగిస్తారు. "అరుణ ప్రవాళ వల్లరి" కవితలో ప్రారంభ వాక్యంలోనే అరుణ ప్రవాళమేమంది? అనటం వల్ల పాఠకాసక్తి పెరిగింది. చివర్లో "విప్లవ ప్రవాళ విజయవల్లరి ఏర్పరిచారు. ప్రజా శత్రువుల పాలిట పెను ఉరి" అని ముక్తాయించటం వల్ల కవితకి శీర్షికకి గొప్ప అనుసంధానం

"గజ దంత గోపురం" కవితలో మొదటి వాక్యమే శీర్షిక అయ్యింది.

"గజదంత గోపురం

లోకాదు కాపురం

కార్మికులు గల పురం

కవికి అంత:పురం" - అనడంతో తన కవితా దృష్టిని శీర్షికతోనే ఆవిష్కరించారు. నా దేశం ఆదేశం, ఐకమత్య గీతం, పూల లోగిలి ముళ్ళ కౌగిలి, అంతర్దర్శనం, శాంతిబాల, కాంతికన్యకలు, ప్రణయ క్రీడ, భాగ్యనగర భాగ్యం, విప్లవ వీరుడు, వంధ్యా మేఘాలు, హర్షపాతం, మిధ్యాగామిరథ్య, భద్రతలేని పట్టభద్రుడు, ఎర్రటి నవ్వులు వంటి అనేక కవితల విషయంలో ఆయా కవితల్లోని భావస్ఫూర్తి గల పదాలనే కవి శీర్షికలుగా నిర్ణయించారు.

కవితలోని విషయానుగతంగా చిక్కనైన ప్రదప్రయోగం జరిగినప్పుడు, ఆ పదాన్నే ఆ కవితకి శీర్షికగా ఉంచటం వల్ల మకుట శోభ ఇనుమడించి, కవిత పట్ల ఆసక్తి కలగటం అనే విషయాన్ని ఇక్కడ స్పష్టంగా గమనించగలం.

**(ఆ). కవితలోని విషయ సూచనని తెలిపే శీర్షికలు :** ఆచార్య గంపా వెంకటరామయ్య తన వ్యాసంలో "స్టైలిష్ అకడమిక్ రైటింగ్" అనే ఆంగ్ల గ్రంథ రచయిత 'స్వార్డ్ హెలెన్' చెప్పిన విషయాన్ని ఇలా ఉటంకించారు.

"శీర్షిక అందంగా ఉండాలి. అది కేవలం సమాచారం ఇవ్వటమే కాక పాఠకుడిలో మేధో జిజ్ఞాసని రేకెత్తించాలి."

ఈ సూచన, ఆ వ్యాసంలో పరిశోధనా గ్రంథ శీర్షిక గురించి చెప్పింది అయినా కవిత్వానికి కూడా చక్కగా నప్పుతుంది.

ఈ పద్ధతిలో దాశరథి తన ఆలోచనాలోచనాలు సంపుటిలో కొన్ని కవితలకి శీర్షికలని నిర్ణయించారు. 'మంగళాచరణం' కవిత, వియత్నాం యుద్ధ వినాశనం గురించి రాసింది. ఆ యుద్ధం వల్ల జరిగిన ప్రాణ, ఆస్తి నష్టాలని హృదయం కదిలించే రీతిలో కళ్ళకు కట్టిన కవి, చివర్లో ఆశావహంగా

"మానవ లోకానికి

మంగళం కలిగేనా?" అని ముగించటం వస్తు సూచనే.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

'జ్ఞానవల్లరి' పేరుతో రాసిన కవిత ఒక గజల్ రూపం. జోష్మాల్సియానీ ఉర్దూ మూలానికి అనువాదం. ఈ శీర్షిక కూడా వస్తు సూచనాత్మకమైంది.

"అవని సృష్టికి ఆది ఎచ్చట అంతమెచ్చట? తెలియదు ! నేను ఎచ్చటి నుండి వచ్చితి? ఎచటి కేగుదు? తెలియదు!" అని ప్రారంభమై

“నాకు మృత్యువు పైననే ఏనాటికైనా నమ్మకం! నా రుజా పటలమ్ము మాపెడి దారిమిత్తికె తెలియును.” అని ముగిసే ఈ కవిత గంభీరమైన ఆధ్యాత్మిక జ్ఞాననిధి. అందుకే ఈ కవితకి “జ్ఞాన వల్లరి” అనే శీర్షిక సార్థకమైంది.

"సూర్యానువర్తిని" కవిత అపురూపమైంది. పొద్దు తిరుగుడు పువ్వుని తన్విగా ఊహించి రమణీయ పదబంధాల్లో బంధించారు కవి. ఈ పువ్వుని సూచిస్తూ శీర్షిక నిర్ణయించటం చాలా సమంజసం. చివర్లో -

“అస్మదీయ నయనాలకు కవనాలు నేర్పిన నీ సుందరరూపం అర్కుడు అవనిపై వెలిగించిన అనురాగదీపం" అనటం చాలా హృద్యం.

ఈ సంపుటిలోని - గుల్ మొహర్ కుసుమాంజలి, కర్తవ్యము, యేది విప్లవం, ఇంతి - పూబంతి, సంక్రాంతి, సైనికుడికి సలాం, తులలేని చెలి, వ్యత్యయం వంటి కవితలు కూడా ఆయా కవితలలోని వస్తుసూచన చేసేవే కావటం గమనార్హం.

**(ఇ) వ్యంగ్య సూచన గల శీర్షికలు:** కవి, కొన్నిసార్లు తన కవితలోని విషయాన్ని బలంగా పాఠకుడిలోకి ప్రవేశపెట్టాలని భావిస్తే ఆయా కవితల్లోని విషయాలకి వ్యతిరిక్త రూపంలో శీర్షికని నిర్ణయించవచ్చు.

ఇది తెలుగు కవిత్వంలో వ్యంగ్యరూప కవితలకి సాధ్యమయ్యే శీర్షికా పద్ధతి అనవచ్చు.

“ముక్తక ముక్తావళి" అనే కవిత పరోక్షంగా విమర్శనాత్మక కవిత. పైకి సుభాషితాలు వల్లిస్తూ లోన కుత్సితంగా మారిన వారిని ఉద్దేశించిన ఈ కవితలో...

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-3, (July-Sept), 2025

"నిన్న మొన్నదాక నే సామవేదిని సామ్యవాది నైతి క్షణములోన కూలిజనుల మేలుగూర్చి భాషింతును తట్టమోయుటన్న తప్పుకొందు"..... "ఆంధ్రభాష వ్రాతు వ్యాకృతి విడకుండ తెనుగుకేల వ్యాకరణ మటందు ఇంగిలీషు నుచ్చరించ నాగరికత మాతృభాషలోన మాట మోటు...." అంటూ ప్రతి ఖండికలో మోసకారులకు చురకలు అంటిస్తారు. ఇలాంటి కవితకు "ముక్తక ముక్తావళి" అని శీర్షిక పెట్టడం దాశరథి వ్యంగ్య వైభవమే.

దాశరథి హాస్య చతురతకు సాక్ష్యమిచ్చే చిన్న ఖండిక ఒకటి ఈ సంపుటిలో ఉంది.

"బ్రతుకుపై విసుగెత్తినవాడు విషము త్రాగి ఆత్మహత్యకు బూన తలచనేల? శాస్త్రపాకము పఠియించి వంటచేయు వనిత చేతి వంటకమును తినిన చాలు!" - అని ముక్తాయించిన ఈ కవితా శీర్షిక 'శాస్త్రీయపాకం' కావటం కవి వ్యంగ్య వైభవమే.

**(ఈ) సంఘటనాత్మక శీర్షికలు:** కవి, ప్రత్యేక సందర్భాలలో తాను చూసిన, అనుభవించిన, తెలుసుకున్న సంఘటనలను కవితగా మలచి తన అనుభూతిని సార్వజనీనం చేసే సందర్భాలు అనేకం ఉంటాయి. అలాంటి కవితలకి ఆయా సంఘటనలని సూచించే శీర్షికని పెట్టడం సమంజసం అవుతుంది.

ఆలోచనాలోచనాలు సంపుటిలోని కవితల్లో కొద్ది సంఖ్యలో సంఘటనాత్మక కవితలున్నాయి. కాని వాటికి కూడా దాశరథి ఆయా కవితల్లోకి పంక్తిని శీర్షికగా వాడారు.

ఉదాహరణకి "భాగ్యనగర భాగ్యం" కవిత ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా రాసిన కవిత. కవి, దానికి శీర్షికను సంఘటనాత్మకతతో బాటు కవితలోని పదాన్ని కూడా జోడించి రాసారు.

"ఆర్యభట్టుకి స్వాగతం" కవితలో మాత్రం కవి, సంఘటనని సూచించే శీర్షికనే ఎంచుకున్నారు.

"భారతీయ మేధాశక్తికి పరమోత్తమ ఉదాహరణం ఆకాశావకాశాలలో ఆర్యభట్టు పరిభ్రమణం..." అంటూ సాగే ఈ కవిత పూర్తిగా భారత్ ప్రయోగించిన తొలి ఉపగ్రహం 'ఆర్యభట్టు'

విజయం సందర్భంగా రాసింది. దానికి తగిన సంఘటనాత్మక శీర్షికనే కవి ఉపయోగించటం చాలా సమంజసం.

"తల్లి పూజకి తరలిరండి" కవిత, ప్రపంచ తెలుగు మహాసభలకి ముందు రాసింది. దాశరథిలోని తెలుగు భాషా మమకారం మొత్తం ఈ కవితలో గోచరమవుతుంది. ఈ కవితకు సంఘటనాత్మక శీర్షిక నుంచటమే కాక ఆ ఆహ్వానాన్ని కవిత చివరలో "తల్లిపూజకు తరలిరండి తరతమ భేదాలు మరచిపోండి" అని శీర్షికావృతం చేశారు. అదీ దాశరథి వారి గొప్పతనం.

**ముగింపు:** గ్రంథశీర్షికా నిర్ణయ ప్రత్యేకతలు, పాటించే పద్ధతులు కవి ఇష్టానుసారంగా జరిగే ప్రక్రియలు. అయితే శీర్షిక ఆ రచనకి తల వంటిది. దాని ప్రాముఖ్యత వల్లే కవితకి అందం, ఆసక్తి ఏర్పడతాయి. దాశరథి "ఆలోచనాలోచనాలు" కవితా సంపుటిలోని వివిధ కవితలకి నిర్ణయించిన శీర్షికలని, కవితలోని వస్తువు ప్రధానాంశంగా విశ్లేషించటం వల్ల శీర్షిక ప్రయోజనాలు కొంతమేర అవగతం అయ్యాయి.

శీర్షికా నిర్ణయ పద్ధతుల్ని కూడా ఆయా శీర్షికలకి అన్వయించటం వల్ల కవితలలోని భావసాంద్రతని శీర్షికలు ఎలా ప్రతిబింబిస్తాయో తెలిసింది.

Philip Kinsher తన వ్యాసం How to Title a poem లో ఇలా అంటారు. "కవితను పాఠకుడు చదవటం ప్రారంభించటానికి ముందే అతడి మానసిక స్థితిని కవితకి అనుగుణంగా శీర్షిక సంసిద్ధం చేయాలి". ఈ విషయంలో దాశరథి కవితా శీర్షికలన్నీ వస్తువుకు అనుగుణంగా పాఠకుడి మానసిక స్థితిని సంసిద్ధం చేయటంలో సఫలమయ్యాయి.

డా||| తూర్పు మల్లారెడ్డి చెప్పినట్లు "దాశరథి గొప్ప సమన్వయవాది. సంప్రదాయానికి ప్రయోగానికి.... అతివాదానికి, మితవాదానికి గొప్ప సమన్వయకర్త ఆయన. ఈ విషయం ఆలోచనాలోచనాలు కవితా సంపుటిలో ప్రతి పుటలో కన్పిస్తుంది. దేశం పట్ల, ప్రజల పట్ల ఒక మానవతా వాది ఎలా స్పందించాలో ఆయన కలం అలాగే స్పందించింది. ఆయన శీర్షికలన్నీ ఇటువంటి సమన్వయ భావనతో నిర్ణయించినవే కావటం గమనార్హం.

**ఉపయుక్త గ్రంథములు:**

దాశరథి. *ఆలోచనాలోచనాలు*. మహేంద్ర ప్రచురణలు, మద్రాసు, 1975.

తూర్పు మల్లారెడ్డి, డా. "దాశరథి అమృతాభిషేకం - ఒక పరిశీలన." *అన్వేషణ: సాహిత్య వ్యాస సంపుటి*, సావిత్రి పబ్లికేషన్స్, హైదరాబాద్, 2023.

వెంకటరామయ్య గంపా, ఆచార్య. "శీర్షికే సర్వస్వం - పరిశోధన 'శీర్షిక'ల లక్షణాలు." *మూసీ: సాహిత్య సాంస్కృతిక చారిత్రక తెలుగు మాస పత్రిక*, సంపుటి 28, సంచిక 5, మే 2025, పి. 30.

ఎలనాగ. "శీర్షిక నుంచే మొదలు కావలె కవిత్వం." *నమస్తే తెలంగాణ*, 8 మే 2022.

Kinsher, Philip. "How to Title a Poem." *Book Baby Blog*, 14 June 2024, bookbaby.com/blog.